క్లుప్తంగా

ఘనంగా రుక్మిణి సమేత శ్రీకృష్ణుడి కల్యాణం



నందిగామ: గీతజయంతి కార్యక్రమంలో భాగంగా స్థానిక గీతమందిరంలో రుక్మిణి సమేత శ్రీకృష్ణుడి కల్యాణ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు నందిగామతోపాటు పరిసరగ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు.

ఆడుదాం ఆంధ్రాపై అవగాహన ర్యాలీ



నందిగామ: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై శనివారం నందిగామ పట్టణంలో అధికారుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి బయలుదేరిన ఈ ర్యాలీ చందర్లపాడు బస్టాండ్, గాంధీ సెంటర్, మెయిన్‌బజార్ల లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం వివరాలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో పద్మ, ఆయాశాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం నుంచి పవిత్రోత్సవాలు జరుగుతాయని ఏసీ శ్రీరామదరప్రసాదరావు శనివారం తెలిపారు. నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ పవిత్రోత్సవాల్లో భాగంగా చివరి రోజు 27న స్వామి వారికి లక్ష తులసి పూజ, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఈవో కోరారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



నందిగామ: ప్రతిఓటరుకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నామని ఆర్డీవో కార్యాలయ ఏవో రాజ్‌కిషోర్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలి, ఓటు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఓటర్లంతా ఈవీఎంల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆర్ఐ వేణుకుమారి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులంతా ఐక్యంగా ఉండాలి

వత్సవాయి(పెనుగంచిప్రోలు): రైతులంతా ఐక్యంగా ఉండాలని సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి సూచించారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వత్సవాయి మండలం భీమవరం సొసైటీ కార్యాలయ ఆవరణలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నాబార్డు సహకారంతో సెర్ప్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని భీమవరంలో వత్సవాయి మండల రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. సెర్ప్ సంస్థ ప్రతినిధి ఆల్బర్ట్ మాట్లాడుతూ రైతులంతా ఐక్యంగా ఉండే పంట ఉత్పత్తుల అమ్మకాల సమయంలో దళారీ వ్యవస్థ బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. సంఘం అభివృద్ధితోపాటు రైతులు అభివృద్ధి చెందాలనేది నాబార్డు ఉద్దేశమని వివరించారు. నాయకులు కారుపాటి ఏసుబాబు, రైతులు పాల్గొన్నారు.

26 నుంచి ఆడుదాం ఆంధ్రా



జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఈనెల 26వ తేదీన ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి శనివారం పేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ పోటీలు స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతాయని వివరించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి



పెనుగంచిప్రోలులో ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తున్న స్వామివార్లు



చిట్యాలలో శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



నందిగామ ముక్కోటి మండపంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

జగ్గయ్యపేట: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని తిరుమలగిరి, వేదాద్రి, ముక్త్యాల గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివార్లు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. తిరుమలగిరిలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులుతీరారు. స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. వేదాద్రి గ్రామంలోని యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి భారీ ఊరేగింపు నిర్వహించారు. ముక్త్యాలలోని భవానీ ముక్తేశ్వరస్వామి వారి ఆలయంలోని వేణుగోపాలస్వామి వారి భక్తులకు ఉత్తర ద్వారా గుండా దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఇబ్బందులేకుండా ఈవోలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెనుగంచిప్రోలు: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో శనివారం కళకళలాడాయి. పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవార్ల ఉత్సవమూర్తులు ఈసందర్భంగా భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారు ఉత్తరద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త కొమరగిరి రఘురామారావు దంపతులు, ఆలయ మాజీ చైర్మన్ కాకాని శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు. శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంతోపాటు మండలంలోని ఆయా ఆలయాల్లో దేవతా మూర్తులు భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చారు.

వత్సవాయి మండలంలో..

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ప్రముఖమైన చిట్యాల గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు, అమ్మవార్లు భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చారు. ఆలయంలో ఏకనామం నిర్వహించడంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మారెళ్ల పుల్లారెడ్డి దంపతులు, సూరారెడ్డి, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో స్వామివార్లు శనివారం ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. నందిగామలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలిరోజు చెన్నకేశవస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ముక్కోటి మహా మండపానికి తీసుకువచ్చి మహోత్సవాలు ప్రారంభించారు. రామలింగేశ్వరస్వామి ఆలయం, నెహ్రూనగర్‌లో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి ఆలయం, మాగల్లులోని మదనగోపాలస్వామి ఆలయంతోపాటు మండలంలోని ఆయా ఆలయాల్లో స్వామివార్లను భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు.



తిరుమలగిరిలో దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి



పేట పాత వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



తిరుమలగిరిలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు



జుజ్జూరులో గరుడవాహనంపై స్వామివారు

జుజ్జూరు(వీరులపాడు): ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివార్లను భక్తులు ఉత్తర ద్వారం నుంచి దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే తరలివచ్చిన భక్తులతో మండలంలోని ఆయా ఆలయాలు కిటకిటలాడాయి. జుజ్జూరులో వేంచేసియున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. నంతరం పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన గరుడవాహనంపై గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని జగ్గయ్యపేటలోని శ్రీరంగనాయకస్వామి ఆలయం, శ్రీమహాలక్ష్మీ వెండిదేవాలయం అమ్మవారు, మార్కండేయస్వామి ఆలయం, వరదరాజస్వామివారి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, శ్రీధనశైలి శ్రీసీతారామస్వామి ఆలయం, కొత్త వెంకటేశ్వరస్వామి తదితర ఆలయాల్లోని స్వామి వార్లను భక్తులు ఉత్తర ద్వారం నుంచి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు, గ్రామపెద్దలు



నందిగామ శ్రీచైతన్య పాఠశాలలో ..



జగ్గయ్యపేట శ్రీగౌతమి హైస్కూల్‌లో..



మల్కాపురంలో చిన్నారుల ప్రదర్శన

కొత్తపేట(కంచికచర్ల) : కంచికచర్ల మండలం కొత్తపేటలో యూత్ ఫర్ క్రైస్ట్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బ్రదర్ శ్రీను ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు చెప్పిన బోధనలను అందరూ ఆచరించాలని సూచించారు. జిల్లేపల్లి రాజు, రాజీవ్, రత్నాకర్ సౌజన్యంతో క్రైస్తవ మహిళలకు బైబిల్‌లోని వాక్యాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. క్రిస్మస్ గీతాలకు చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంఘ కాపరులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ గుత్తా ప్రదీప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో క్రీస్తు జననానికి సంబంధించి ఏర్పాటుచేసిన ప్రత్యేక కుటీరం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

నందిగామ: పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. క్రీస్తు జననం, క్రిస్మస్ ప్రత్యేకతను వివరించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఇంటిగ్రిటీ బాలికల హాస్టల్‌లో వార్డెన్ సుల్తానా ఆధ్వర్యంలో, స్థానిక శ్రీగౌతమి హైస్కూల్‌లో పాఠశాల డైరెక్టర్ బొల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, మల్కాపురంలోని ఎల్ఈఎఫ్ చర్చి ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పాస్టర్ రత్నం, దైవజనులు అంబోజి బాబురావు, సంఘ కాపరి టి.బాబురావు, పాస్టర్ కె.శ్యాంసన్, సంఘస్తులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న ఇందిరా కాలనీకి చెందిన దారెల్లి అశోక్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ శనివారం రూ.5వేలను ఆర్థికసాయంగా అందజేశారు. మందులు, నిత్యావసర సరుకుల కొనుగోలుకు తనవంతు సాయం అందించినట్లు ప్రభాకర్ తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు గోగుల వెంకయ్య, స్థానిక నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తరలిన స్విమ్మర్లు



జగ్గయ్యపేట అర్బన్: కర్నూలులో ఆదివారం నుంచి జరుగనున్న స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు జగ్గయ్యపేటకు చెందిన డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ స్విమ్మర్లు శనివారం తరలివెళ్లారు. ఈపోటీలకు పురుషుల విభాగం నుంచి 18మంది, మహిళా విభాగం తరఫున 14మంది స్విమ్మర్లు హాజరవుతున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మండడపు శ్రీనివాసరావు తెలిపారు. స్విమ్మర్ల బృందానికి కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మి ఆధ్వర్యంలో టీమ్ మేనేజర్ అన్నంనీడి కళ్యాణ్ నాయకత్వం వహిస్తున్నట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో కొరాయి ఉత్సవాలు



పేటలో కొరాయి ఉత్సవానికి తరలివచ్చిన స్వామివార్ల రథాలు



పెనుగంచిప్రోలులో తిరుపతమ్మ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

జగ్గయ్యపేట అర్బన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలో శనివారం కొరాయి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా బలుసుపాడురోడ్డులోని పాత వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సాగిన పొన్నవాహన సేవ పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. కొయ్యతో చేసిన పొన్నచెట్టును వాహనంగా చేసుకుని సాగిన రథోత్సవంలో పొన్నచెట్టుపై గోపికల వస్త్రాలను అపహరించే శ్రీకృష్ణుని ప్రతిమను ఉంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ముక్త్యాల రోడ్డులోని బంగారు కొట్ల సెంటర్‌లోని విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన కొరాయి ఉత్సవానికి ఆయా ఆలయాల నుంచి ఉత్సవ విగ్రహాలు నగరోత్సవంగా తరలి వచ్చాయి. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారి గ్రామోత్సవం శనివారం రాత్రి వైభవంగా సాగింది. ఉత్తరద్వార ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారిని రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఏఈవో ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ధర్మకర్తలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

మొగ్గలరాజపురం(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరికీ వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా చెప్పారు. నేషనల్ కన్జ్యూమర్స్ డే సందర్భంగా శనివారం రావిచెట్టు సెంటర్ సమీపంలోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో వినియోగదారులు హక్కులపై అవగాహన సదస్సు జరిగింది. విద్యాకన్నా మాట్లాడుతూ.. 1986వ సంవత్సరం నుంచి మన దేశంలో వినియోగదారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా అన్యాయమైన వ్యాపారం, మోసం, సేవల్లో లోపం వంటి వాటి నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించడం ఈ చట్టం ముఖ్య లక్ష్యమని విద్యాకన్నా చెప్పారు. వినియోగదారులు కోర్టులను ఆశ్రయించి పరిహారం పొందవచ్చన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



ముచ్చింతాల : విద్యుద్దీపాలంకరణలో లూర్దుమాత ఆలయం



ముచ్చింతాలలోని సీఎస్ఐ చర్చి



నందిగామలోని ఎస్సీకాలనీ వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్

క్రిస్మస్ సందడి



నందిగామలోని మెయిన్‌బజార్‌లో కనిపిస్తున్న రద్దీ

క్రిస్మస్ పండుగకు నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. క్రైస్తవులు చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చర్చిల ఎదుట క్రిస్మస్ ట్రీ, స్టార్స్, క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలియజేసే సెట్టింగ్‌లు ప్రత్యేకాకర్షణగా నిలుస్తున్నాయి. ఏసుక్రీస్తు రాకను కాంక్షిస్తూ క్రైస్తవులు భారీ క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేశారు. క్రిస్మస్ పండగ నేపథ్యంలో వస్త్ర దుకాణాలు, క్రిస్మస్ స్టార్స్, డెకరేషన్ వస్తువులు విక్రయించే షాపులు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది.

– నందిగామ/పెనుగంచిప్రోలు/జగ్గయ్యపేట అర్బన్



రంగులతో తీర్చిదిద్దిన రాఘవాపురంలోని పురాతన సీఎస్ఐ చర్చి



జగ్గయ్యపేటలో క్రిస్మస్ స్టార్లను కొనుగోలు చేస్తున్న ప్రజలు



నందిగామలో కొనుగోలుదారులతో కిక్కిరిసిన ఓ వస్త్రదుకాణం

వృద్ధులకు కళ్లజోళ్ల పంపిణీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పరీక్షలు చేయించుకుని, కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన వారికి శనివారం కళ్లజోళ్లను అందజేశారు. నగరంలోని అజిత్‌సింగ్‌నగర్ యూపీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పలువురికి కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా 243 సచివాలయానికి సంబంధించి 14 మందికి, 244 సచివాలయం పరిధిలో 38 మందికి కళ్లజోళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. కళ్లజోళ్లు అందుకున్న వారు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ డీపీఎంఓ డాక్టర్ నవీన్, డెప్యూటీ తహసీల్దార్ ఎన్.కోటేశ్వరమ్మ, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సృజన్ తదితరులు పాల్గొన్నారు.